శివారు ప్రాంతంలో ప్రగతి పరుగులు

- రూ.77వ వార్డులో సుమారు రూ.30 కోట్లతో పనులు
- రోడ్లు, కాలువలు, ఆస్పత్రుల నిర్మాణం
- ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- మౌలిక సదుపాయాల కల్పనపై స్థానికుల హర్షం


ఇస్లాంపేట ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు భవనం


నమ్మిదొడ్డిలో కొత్తగా నిర్మించిన రోడ్డు


77వ వార్డు నమ్మిదొడ్డిలో కొత్తగా నిర్మించిన యూపీహెచ్‌సీ

పెదగంట్యాడ: నగరానికి శివారు ప్రాంతమైనప్పటికీ ప్రగతి మాత్రం పరుగులు పెడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా.. మునుపెన్నడూ చూడని విధంగా జీవీఎంసీ 77వ వార్డు అభివృద్ధి పథంలో నిలిచింది. వార్డు పరిధిలో 32 గ్రామాలు ఉన్నప్పటికీ విశాఖ నగరానికి దూరంగా ఉండటంతో గత పాలకులెవరూ పట్టించుకోలేదు. 2019 తర్వాత వార్డు దశ తిరిగింది. ఆపై జీవీఎంసీ కొత్త కార్యవర్గం వచ్చిన తర్వాత సుమారు రూ.30 కోట్లతో పనులు చేపట్టడంతో ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందింది.

అభివృద్ధి ఇలా..

- ఈ ప్రాంతంలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఒక కోటి 80లక్షల రూపాయలతో అత్యాధునికంగా తీర్చిదిద్దారు. ఆపై ఆధునిక సదుపాయాలు కల్పించారు.
- ఒక కోటీ 22 లక్షల రూపాయలతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు. ఈ కేంద్రంలోనూ అత్యాధునిక సదుపాయాలు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచారు. రోగులను నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి.
- ఇస్లాంపేట తుపాను భవనం నుంచి పిట్టవానిపాలెం రైల్వే ట్రాక్ వరకు 2 కోట్ల 20 లక్షల రూపాయలతో తారు రోడ్డు నిర్మించారు.
- శ్రీరామ్‌నగర్ నుంచి నమ్మిదొడ్డి జంక్షన్ వరకు రూ.80 లక్షలతో రోడ్డు నిర్మించారు.
- రూ.20 లక్షలతో పెదపాలెం, రూ.40 లక్షలతో చినపాలెంలో రోడ్లు, కాలువలు నిర్మించారు.
- పిట్టవానిపాలెంలో రూ.20లక్షలతో రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- రూ.20 లక్షలతో పలికిలవానిపాలెంలో రోడ్డు నిర్మించారు.
- మిస్కాందొడ్డిలో రూ.20 లక్షలతో రహదారి నిర్మాణం చేపట్టారు.
- దేవాడలో రూ.30 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మించారు.
- అన్ని గ్రామాల్లోని ప్రజలకు తాగునీటిని అందించేందుకు రూ.80 లక్షలతో పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. ఆపై ఇంటింటికీ కుళాయిలు మంజూరు చేశారు.

'అప్పికొండ'కు మహర్దశ

సముద్ర తీరానికి ఆనుకొని ఉన్న గ్రామం అప్పికొండ. ఈ గ్రామంలోని ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నిత్యం యాతన పడేవారు. మౌలిక సదుపాయాల కోసం ఆందోళన చెందేవారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆ ప్రాంతానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించారు. రూ.5 లక్షలతో కమ్యూనిటీ హాల్ మరమ్మతులు చేపట్టారు. అలాగే రూ.22.7లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు, రూ.20 లక్షలతో రింగ్ రోడ్డు నిర్మించారు. అయితే ఈ గ్రామంలోకి వెళ్లేందుకు అక్కడ ఒక పెద్ద గెడ్డ అడ్డుగా ఉండడంతో పాటు పాత వంతెన శిథిలావస్థకు చేరడంతో గ్రామంలోకి రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడేవారు. దీంతో ఇక్కడ కోటి రూపాయలతో కొత్తగా వంతెన నిర్మించారు. రూ.16 లక్షలతో ప్రాథమిక పాఠశాలకు మరమ్మతులు చేశారు. రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మించారు. రూ.20లక్షలతో శ్మశానవాటికను అభివృద్ధి చేశారు. సముద్ర తీరానికి నేరుగా చేరుకునేందుకు రూ.17.70 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.

రోడ్డు నిర్మాణంతో సాఫీగా ప్రయాణం



గతంలో ఇక్కడి రోడ్లన్నీ గతుకుమయంగా ఉండేవి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. రోడ్లన్నీ ఇరుగ్గా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవి. ఇప్పుడు కొత్తగా రోడ్లు వేయడంతో పాటు వాటిని విస్తరించడంతో ప్రయాణాలు సాఫీగా సాగిపోతున్నాయి.

– దాసరి ప్రకాశ్‌రెడ్డి, దాసరిపేట

ఎన్నడూ చూడని విధంగా అభివృద్ధి



నేను ఇక్కడే పుట్టి, పెరిగాను. నా చిన్నతనం నుంచి చూస్తున్నాను. మా గ్రామాలు విశాఖ నగర పరిధిలో ఉన్నప్పటికీ సదుపాయాలు మాత్రం ఉండేవి కావు. ఇటీవల ఒక్కసారిగా మా గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. ఆస్పత్రులు కట్టారు. పాఠశాలలను అభివృద్ధి చేశారు. ముఖ్యంగా తాగునీటి సదుపాయం కల్పించారు. రోడ్లన్నీ బాగా వేశారు.

– పిట్ట సంజీవరెడ్డి, పిట్టవానిపాలెం

క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే నాగిరెడ్డి


సీఎంతో ఎమ్మెల్యే నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డి తదితరులు

గాజువాక : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి సోమవారం కలిశారు. తమ కుమారులు తిప్పల వంశీరెడ్డి, తిప్పల దేవన్‌రెడ్డి, సోదరుడి కుమారుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డితో కలిసి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎంను కలిశారు. గాజువాక నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని ఈ సందర్భంగా సీఎం సూచించినట్లు నాగిరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


కల్యాణం జరిపిస్తున్న రుత్వికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు కృష్ణమాచార్యులు, అర్చకులు భావ నారాయణ స్వామి, హరి నారాయణ స్వామి నేతృత్వంలో ఉదయం ధ్వజారోహణం చేశారు. కల్యాణాన్ని వీక్షించేందుకు ఉక్కు నగరం, పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మంగళవారం సాయంత్రం ఆలయంలో పండిత సదస్యం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

అప్పన్న ఆలయానికి మంగళసూత్రాల బహూకరణ


ఈవోకు మంగళ సూత్రాలు అందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కూర్మన్నపాలేనికి చెందిన ఎ.అప్పలరాజు దంపతులు 68 గ్రాముల బంగారు మంగళ సూత్రాలను బహూకరించారు. సింహగిరిపై దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తికి వీటిని అందజేశారు. ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ సిరిపురపు కనకరాజు, ఉద్యోగి సాంబ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కోలాట పోటీల విజేత పరవాడ

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో పరదేశిమాంబ జాతరను పురస్కరించుకొని ప్రముఖ పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పరవాడ సీతారామ కోలాట బృందం ప్రథమ స్థానంలో నిలిచింది.రెండో స్థానంలో శ్రీరామపట్నం జై శ్రీరామ్ కోలాటం బృందం కళాకారులు నిలిచారు. మూడో బహుమతిని శ్రీకాకుళం జిల్లా కుర్లాం శ్రీ తిరుమల శ్రీనివాస జట్టు గెలుచుకుంది. నాలుగో బహుమతి అంకుపాలెం శ్రీ అభయాంజనేయ కళాకారుల బృందం దక్కించుకుంది. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన జట్లకు వరుసగా రూ. 15 వేలు , రూ.12 వేలు, రూ.9 వేలు, రూ.6 వేలు, రూ.3 వేల చొప్పున గ్రామ సర్పంచ్, శ్రీనివాస్ సోదరుడు బోకం స్వామినాయుడు,మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వనం దేముడు బాబు, బోకం కాసు బాబు, బండారు చిన్నం నాయుడు, రాము, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక వర్గంపై కక్ష సాధింపు చర్యలు తగవు'


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోయాజమాన్యం కార్మిక వర్గంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదన్నారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి దరి యూనియన్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యాజమాన్యం రోజుకో కొత్త ఉత్తర్వులతో కార్మికులను హడలెత్తిస్తోందన్నారు. ప్లాంట్‌కు అవసరమైన వనరులు సమకూర్చాల్సిన యాజమాన్యం కార్మికులపై దాడులకు దిగుతోందన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు తప్పవన్నారు. ఉక్కు పరిరక్షణ సభ విజయవంతానికి కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, డి.మోహన్, కోరాడ వెంకటరావు, ప్రసాద్, పి.వి. నగేష్, గంగవరం గోపి తదితరులు పాల్గొన్నారు.

త్రిశక్తి ఆలయంలో ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం


ఆలయ ఆవరణలో సామూహిక పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు లక్ష్మీపురంలో దుర్గాలమ్మ, నూకాలమ్మ, పోలిపల్లిమ్మ అమ్మవార్ల ప్రతిష్టాపనోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా గణపతి పూజ, ప్రతిష్ట సంకల్పం, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచగవ్య ప్రాశనం, రక్షాసూత్రధారణ, రుత్విక్ వరుణ, గోపూజ, యాగశాల ప్రవేశం , చతుర్ద్వార పూజ, షోడశ స్తంభ పూజ, అఖండ దీపస్థాపన, నీరాజన మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలను ప్రధాన అర్చకులు ఇరగవరపు వాసు శ్రీధర్ స్వాముల పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అవిరెడ్డి సూర్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కుచ్చర్లపాటి రామరాజు, సెక్రటరీ సిరసపల్లి బాబూరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మింది గ్రామంతో విడదీయలేని అనుబంధం

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్


సమావేశంలో పాల్గొన్న అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు మింది గ్రామంతో తమకు వీడదీయలేని అనుబంధం ఉందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గుడివాడ కుటుంబం అంటే మింది గ్రామం అని ప్రజల మాట అన్నారు. మిందిలోని గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో గ్రామ నాయకులు, స్థానికులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి గాజువాక నుంచి తనకు అవకాశం కల్పించారని, గ్రామంలో ప్రతీ ఒక్కరు తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మింది గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులతో మంత్రి అమర్‌నాథ్ భేటీ


మంత్రి రాజశేఖర్‌తో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్


ధర్మాల శ్రీనుతో మంత్రి అమర్‌నాథ్

పెదగంట్యాడ: రాష్ట్ర ఐటీ, భారీ పరిశ్రమల శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ మండలంలోని ముఖ్యనాయకులతో సోమవారం భేటీ అయ్యారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మంత్రి రాజశేఖర్ స్వగృహానికి వెళ్లిన ఆయన 76వ వార్డు నాయకులు, కార్మిక సంఘాల నాయకులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గుడివాడ లతీష్, మంత్రి శంకరనారాయణ, రంబ నారాయణమూర్తి, బ్రహ్మానందరెడ్డి, కామేశ్వరరావు, బలగా రామారావు, తలారి నాగేశ్వరరావు, గొందేశి ప్రభాకర్‌రెడ్డి, కులుకూరి శ్రీనివాసరావు, మంత్రి గోపీనారాయణ పాల్గొన్నారు.

- వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీనుతో మంత్రి అమర్‌నాథ్ భేటీ అయ్యారు. ఎమ్మెల్యే నాగిరెడ్డికి అందించినట్లే తమకూ సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు తిప్పల గోపీ, తిప్పల అప్పలస్వామి, డీఎల్‌బీ నూకరాజు, కొవిరి బాపనయ్య, పేర్ల దేవ, పితాని అన్నవరం పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే అభివృద్ధి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ పరిశ్రమల వల్లనే అభివృద్ధి జరిగిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటు పరం చేయాలనుకోవడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 1131వ రోజు, సోమవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలను వదిలి, తమ రాజకీయ అవసరాల కోసం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడి స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

- పరీక్ష కేంద్రాల్లో స్క్వాడ్ తనిఖీలు
- పటిష్టంగా పోలీస్ బందోబస్తు


నడుపూరు పాఠశాల వద్ద హాల్‌టికెట్ నంబర్ సరి చూసుకుంటున్న విద్యార్థులు


అక్కిరెడ్డిపాలెంలోని పరీక్ష కేంద్రంలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులు


గాజువాక హైస్కూల్లో హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు


అగనంపూడిలో పరీక్ష కేంద్రంలోకి వస్తున్న టెన్త్ విద్యార్థులు


లంకెలపాలెం హైస్కూల్ వద్ద వేచి ఉన్న టెన్త్ విద్యార్థులు


చైతన్యనగర్‌లోని ఒక పరీక్ష కేంద్రం వద్ద రద్దీ

గాజువాక : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గాజువాక పరిధిలో ఏర్పాటు చేసిన 20 పరీక్ష కేంద్రాల్లో 3,992 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 3963 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి సునీత తెలిపారు. మొత్తం 27 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా, ఇద్దరు విద్యార్థులకు మాత్రం మినహాయింపునిచ్చినట్టు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు ఆంక్షలను పటిష్టంగా అమలు చేశారు. స్క్వాడ్ సిబ్బంది పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. చైతన్యనగర్‌లోని కేంద్రాల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. పలు పరీక్షా కేంద్రాలను ఆమె పరిశీలించారు.

పెదగంట్యాడ మండలంలో 97.4 శాతం హాజరు

పెదగంట్యాడ: మండలంలోని నాలుగు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో, రెండు ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన పరీక్షలకు మొత్తం 1311 మంది విద్యార్థులకు 1277 మంది విద్యార్థులు హాజరయ్యారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏ–సెంటర్‌లో 244 మంది విద్యార్థులకు 238 మంది, బీ సెంటర్‌లో 233 మంది విద్యార్థులకు 220 మంది పరీక్షకు హాజరయ్యారు.. ఇస్లాంపేట జెడ్పీ హైస్కూల్లో 200 మందికి గాను 198 మంది, గంగవరం హైస్కూల్లో 124 మంది విద్యార్థులకు 118 మంది హాజరయ్యారు. బీసీ రోడ్డులోని చైతన్య స్కూల్‌లో 230 మందికి గాను మొత్తం విద్యార్థులు హాజరయ్యారు.గంగవరం రోడ్డులోని విశాఖ విమల విద్యాలయంలో 280 మందికి 279 మంది హాజరయ్యారు.పరీక్ష కేంద్రాల వద్ద న్యూపోర్టు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్క్వాడ్ బృందాల తనిఖీ

అగనంపూడి:అగనంపూడి హైస్కూల్లో పదో తరగతి పరీక్షలకు శతశాతం విద్యార్థులు హాజరయ్యారు. రెండొందల మందికి గాను అందరూ హాజరయ్యారు. లంకెలపాలెం హైస్కూల్లో 212 మంది విద్యార్థులు, పెదముషిడివాడ పరీక్ష కేంద్రంలో 210 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. రెండు కేంద్రాలకు ఆర్‌జేడీ విజయభాస్కర్, డీఈవో వెంకట లక్ష్మమ్మ, ఎంఈవో సాయి శైలజతో కూడిన స్క్వాడ్ బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

కణితి హైస్కూల్లో 100 శాతం హాజరు

కూర్మన్నపాలెం: కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో 250 మంది విద్యార్థులకు గాను అందరూ పరీక్షకు హాజరయ్యారని ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశరావు తెలిపారు.

అక్కిరెడ్డిపాలెంలో..

అక్కిరెడ్డిపాలెం: 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో 167 మంది విద్యార్థులకు గాను 161 మంది, మింది హైస్కూల్లో 164 మందికి గాను 161 మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో 'బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్'

- అవయవదానానికి ముందుకొచ్చిన 54 మంది సభ్యులు



అసోసియేషన్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ పాఠశాలల్లోని పూర్వ విద్యార్థులకు, సంస్థ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉండేందుకే బీహెచ్‌పీవీ హార్ట్‌ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. సంస్థ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ లోగోను సంస్థ సీనియర్ ఉద్యోగి టి.ఎల్.నర్సింగరావు ఆవిష్కరించారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్న ఉద్యోగుల పిల్లలకు తమ చేతనైన ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు. అసోసియేషన్‌లో 54 మంది సభ్యులు అవయవ దానానికి అంగీకారం తెలియజేస్తూ ఆర్గాన్ డొనేషన్ ఆర్గనైజేషన్ ప్రతినిధికి దరఖాస్తులు అందించారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ములకా నానిబాబు (అమెరికా), అధ్యక్షుడిగా జరజాన రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా పి. శ్రీనివాసులు, కార్యదర్శిగా మద్దిల రవిశంకర్ తదితరులను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ లైన్‌మన్ మృతి

మల్కాపురం: కంచరపాలెం పరిధిలో 11కేవి విద్యుత్ ఫీడర్ నిర్వహణ ప్రక్రియలో విధులు నిర్వహిస్తూ కింద పడిపోయిన ఒక లైన్‌మన్, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అలీ(35) అనే లైన్‌మన్ గత నెల 24న కంచరపాలెం, ధర్మానగర్ వద్ద 11 కేవీ ఫీడర్ విద్యుత్ నిర్వహణలో భాగంగా విధులు నిర్వహిస్తుండగా పోల్ మీద నుంచి కిందపడిపోయాడు. దీంతో అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న సయ్యద్ అలీ సోమవారం ఉదయం మృతి చెందారు. మృతుడి సోదరుడు మహమ్మద్ హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ రవికుమార్ దర్యాప్తు చేపట్టారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు


మాట్లాడుతున్న ఈఆర్వో లక్ష్మారెడ్డి

గాజువాక : ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని గాజువాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.లక్ష్మారెడ్డి సూచించారు. అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి అధికారులు, సిబ్బందితో గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, విగ్రహాలన్నింటికీ ముసుగులు వేయాలన్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ప్రతీ అధికారి, సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారం అందించాలన్నారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధాలు పెట్టుకోకుండా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన నాయకులపై కఠిన చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. నగదు, బహుమతులు పంపిణీ చేయడంవంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే తక్షణమే స్థానిక పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిబంధనల అమలు విషయంలో అన్ని విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సన్యాసినాయుడు, తహసీల్దార్లు శ్రీవల్లి, భాస్కరరావు, సౌత్ ఏసీపీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.